


# పరిశోధన

అరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి

"ఒరేయ్, రాత్రింబవళ్ళు అదేపనిగా చదివితే ఆరోగ్యం కాస్తా దెబ్బ తింటుంది. అయినా పరీక్షలై పోయాక కూడ అంతగా కష్టపడి చదవట మెందుకు?"

దీక్షగా చదువుతూన్న శేఖర్ కు మోహన్ మాట వినిపించనేలేదు!

"అబ్బ. ఏం చదువురా! ప్రొఫిషి యెన్సీ ప్రైజ్ తెచ్చుకోవాలనా? ఇంతకీ అది క్లాసుపుస్తకమేనా?" శేఖర్ దగ్గర్నుంచిలాక్కున్న ఆ పుస్తకం పేరు చూస్తూనే ఆశ్చర్యం ప్రకటించాడు మోహన్. 'ఆఫ్టర్ డెత్! మరణానంతరం!' "ఏమిట్రోయ్, ఎందుకంతగా ఇది చదువుతున్నావ్? ఇంకా క్లాసు పుస్తకమేమో అనుకున్నాను నేను!"

"ఎందుకంత ఆశ్చర్యం?" ఒళ్లు విరుచుకుంటూ అడిగాడు శేఖర్. "మానవునిలో ఎన్నెన్ని అద్భుతశక్తు లున్నాయ్? మరణానంతరం ఏమౌతున్నాయ్ ఇవన్నీ? మరణం ఏమిటి? ఎందుకొస్తుంది? ఆత్మ అనేదానికి నాశనం లేనంటారుకదా? అది ఏమౌతోంది? ఈ జీవితనాటకానికి అర్థం ఏమిటి?"

గుడ్లు నిలబెట్టేశాడు మోహన్. "ఒరేయ్ ఒరేయ్ ఏమిట్రా ఇదంతా? లక్షణంగా చదువుకుని, హాయిగా షికార్లుకొట్టే కుర్రాళ్ళం మన కెందుకురా యివన్నీ?"

"మనక్కాకపోతే మరెవరికిరా? మనకే కావాలి. ఒంట్లో శక్తీ, మెదడులో పటిష్ఠతా, ఆలోచనాబలమూ వున్న మనకే కావాలిరా ఇవన్నీ, మనమే పరిశోధించాలిరా."

జాలిగా, జాలిగా చూచాడు మోహన్. "ఒరేయ్ ఇటువంటివన్నీ ఆలోచించితే నువ్వు వైరాగాడి వవ్వడమో, పిచ్చివాడివవ్వడమో ఖాయంరా. బుద్ధి ఇలా వికటించబట్టే కదా సిద్ధార్థుడు అంత రాజ్యమూ కాలదన్నుకుని వైరాగి అయ్యాడు!"

"ఛస్ పిరికివాడా, నీ పిరికిమందంతా నాకు పోయకు. నేనిది పరిశోధించి తీరుతాను. ఎందుకు పుడతాం, ఎందుకు బ్రతుకుతాం, ఎందుకు ఛస్తాం? ఇవి తెల్సుకోవాలంటే చావు తర్వాత ఏమిటీ అనేది తెలియాలి."

రెండు చేతులూ ఎత్తి నమస్కరించాడు మోహన్. "నీ యిష్టంరా బాబూ. ఆ పైన నీ మీద ఆశలు పెట్టుకున్న వాళ్ళ ఖర్మం. అంతే. ఇలాంటి పిచ్చిఊహాలు ఊరికే రావు. నిన్నే భూతమో, పిశాచమో పట్టిందిరా. బాబోయ్."

సూటిగా చూచాడు శేఖర్ మోహన్ను. "ఒరేయ్. ఒక్కటి చెప్పరా. ఇప్పుడు నువ్వన్నావే భూతాలూ ప్రేతాలూ అని-అవి నిజంగా వున్నాయట్రా? నువ్వెప్పుడైనా చూచావా?" అమితాసక్తితో ప్రశ్నించాడు.

గుండె సవరించుకుంటూ దీనంగా అన్నాడు మోహన్. "బాబ్బాబూ! ఒరే శేఖరం. మాట్లాడకుండా పడుకోరా. టైమెంతయిందో చూశావా? రాత్రి పన్నెండున్నర! ఇది ఎటురాలా దెయ్యాల టైము. నీకు పుణ్యముంటుంది, ఇప్పుడీ అర్ధరాత్రివేళ వాటిని తలపెట్టకురా."

"ఓరి నీ భయం బంగారంగానూ!" హేళనగా చూశాడు శేఖర్. "మనం మెడికల్ స్టూడెంట్సుంకూడాను. ఇలా మాట్లాడటానికి నీకు సిగ్గు లేదట్రా? నిత్యం ప్రేతాలతో ఆటకదురా మనం ఆడుకొనేది? పుర్రెలు, అస్థిపంజరాలు, ఎముకలు, శవాలు, రోగాలు – వాటి మధ్యేకదరా మన జీవితాలు, మన చదువూనూ?"

"ఏదో చదువుతాం బ్రతుకుకోసం. అంతే. ఇక ఆపైకిమాత్రంవెళ్ళకు, మహాప్రభో నువ్వు బుద్ధిగావుండు. నన్నిలా బ్రతకనీ. ఇలాంటివి మాట్లాడితే నేన్నీ రూమ్లోంచి పారిపోతానంతే, నీయిష్టం!"

హేళనగా నవ్వాడు శేఖర్. "పడుకోరా పిరికి వాజమ్మా. నీతో ఇవన్నీ చెప్పటం నాదే బుద్ధితక్కువ. నిన్నమొన్న ఏంచేశానో చెప్తే అసలు నువ్విప్పుడే గుండెఆగి ఛస్తావ్!"

"ఏమి" టన్నట్లు చూచాడు మోహన్.

తానుకూడా పక్కసర్దుకు పడుకుంటూ అన్నాడు శేఖర్: "నిన్నమొన్న నీకు సెకండుషో సినిమాకెళ్ళా

నని చెప్పాను కదూ? అది అబద్ధం... రాత్రి తొమ్మిదినుంచి రెండు గంటల వఱకూ శ్మశానంలో కూర్చున్నానురా రెండ్రోజులూ కూడ - దయ్యాలు కన్పిస్తే మాట్లాడదామని! కాని ఒక్కటీ కన్పించలేదు!"

నోట మాటరాని మోహన్ శరీరమంతా గజగజా వణకసాగింది. అంతలో టేబిల్ మీదున్న పుఱ్ఱె ఎగిరెగిరి పడడం మొదలు పెట్టింది.

మోహన్ భయంగా చూచాడు.

శేఖర్ చిత్రంగా చూచాడు.

"బాబో...య్!" చావుకేకలాంటి గావుకేక పెట్టాడు మోహన్. "దయ్యం! దయ్యం!" అంటూనే దుప్పటి తలవరకూ ముసుగుపెట్టేసుకున్నాడు, కాని వణకటమూ కేకలూ మాత్రం మానలేదు. "చచ్చేంరా బాబోయ్, దయ్యాలురోయ్!"

శేఖర్‌కు ఎటూ తోచని తమాషాగా వున్నదిదంతా. పరీక్షగా చూచాడటు టేబిల్ వైపు, పుఱ్ఱె అలాగే ఎగిరెగిరి పడ్తూ బల్లపైనున్న పుస్తకాల దొంతిని కొట్టుకుంది. రెండు మంచి బైండింగువర్కు వున్న పుస్తకాలు పెద్దశబ్దంతో నేలమీద పడ్డాయ్.

"ఓరి నాయనోయ్." ముసుగు పెట్టుకునున్న మోహన్ ముసుగుతో పాటే ఎగిరిపడ్డాడు మంచంమీద. ఓ పక్క వణకిపోతూనే మంచంమీద అటూఇటూ పరుగెత్తసాగాడు, గాభరాగా. "ఇదుగో చూడు తల్లీ, నిన్ను నేనేం జేశాను? అదుగో, చేస్తూన్నదంతా వాడేనమ్మా. నన్ను...న... ..న్ను వ......వ్వదిలేసేయ్, వచ్చే నెలలో నా పెళ్ళికూడాను!"

"ఛీ నోర్మూయ్." ఉరిమాడు శేఖర్. "నువ్వు నోర్మూయ్ ముందు. దయ్యంకంటే ముందు నేనే చంపేస్తాను నిన్ను నోరెత్తావంటే," అంటూ మంచానికున్న దోమతెర కఱ్ఱ ఒకటి లాగి పైకెత్తాడు.

భయపడ్డ మోహన్ మాటలు ఏకరువుపెడ్తూ ఏడవడం మానేశాడు కాని, కూర్చుని అదేపనిగా మౌనంగా ఏడవసాగాడు.

శేఖర్ కఱ్ఱ పైకెత్తి పట్టుకుని ఎగుర్తూన్న పుఱ్ఱెను పరీక్షగాచూశాడు.

ఈసారి పుఱ్ఱె సిరాబుడ్డిని క్రింద పడేసి పగులకొట్టింది.

"అయ్యబాబోయ్" మళ్లా పెద్ద కేక పెట్టాడు మోహన్. ఏడుపుస్థాయి కూడా పెంచాడు.

అప్పుడే అరగంటనుంచీ ఔతూన్న గడబిడ విన్న ప్రక్కగదుల్లో స్టూడెంట్సు కిటికీలదగ్గర పోగయ్యారు. వాళ్ళను చూచి మోహన్ ఏడుపు యింకా ఎక్కువ చేశాడు, ఎగిరిపడ్తూన్న పుఱ్ఱెను వ్రేలితో చూపిస్తూ.

శేఖర్ మాత్రం తొణకలేదు. అట్టే

చూచిచూచి ఆ పుట్టమీద సత్తువకొలదీ చేతిలో కట్టతో ఒక్క దెబ్బ వేశాడు. కొద్దిక్షణాలు ఆగి అది ఇంకా ఎత్తుగా ఎగిరిపడటం ప్రారంభించింది.

బయటినుంచి గుసగుసలూ, కేకలూ, ప్రశ్నలూ ప్రారంభమయ్యాయి.

శేఖర్ కు మాత్రం ఎటువంటి ఖంగారూ కలుగలేదు. ఈసారి పుట్టను క్రిందికి త్రోసేశాడు బల్లమీదనుంచి.

మోహన్ కళ్ళురెండూ గట్టిగా చేతుల్తో మూసేసుకున్నాడు.

క్రింద దొర్లుతూన్న పుట్టలోంచి ఓ ఎలుకపిల్ల బయటికి వచ్చింది. పారి పోతూన్న దానిమీద రెండు కట్టదెబ్బలు వేసేసి చంపేశాడు శేఖర్. దాన్ని తోకపట్టి తెచ్చి, మోహన్‌ను గట్టిగా కుదిపి చూపించాడు. "ఇదుగోరా నీ దయ్యాన్ని చంపేశాను."

కళ్ళమీదనుంచి చేతులు కొంచం మాత్రం తొలగించి, బెదురుబెదురుగా ఆ ఎలుకవేపూ పుట్టవేపూ మార్చిమార్చి చూచాడు మోహన్. "అయితే దయ్యం కాదూ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏమో దయ్యమో దేవతో, ఇదే అది."

చచ్చిన ఎలికను వీధి తలుపు తీసి బయట పారేసి, చేతులు కడుక్కు వచ్చాడు శేఖర్. అంతవఱకూ కిటికీ లలో గుమిగూడి తమాషా చూస్తున్న వారంతా బిలబిలా లోపలికి వచ్చే శారు. వారికి సంగతి ఆద్యంతం వివరిం చాడు మోహన్. అతడి స్వరంలో ఇంకా ఏడుపూ, భయమూ తొంగి చూస్తూనే వున్నాయి.

విషయం విని వారిలో కొందరు తమతమ అనుభవాలూ, తమకు తెలిసిన వారి అనుభవాలూ ఉదహరించ ప్రారం భించారు. చాలమంది, సుమారు రెండు వంతులమంది దయ్యాలు లేవన్నారు. ఒక వంతుమంది వున్నాయన్నారు.

అందరూ రెండు పార్టీలై పోయి సవాళ్ళుకూడా చేసుకున్నారు. అన్నీ జాగ్రత్తగా వింటున్నాడు శేఖర్ మౌనంగా.

"అరే! ఇంతకీ కథానాయకుడు శేఖర్ ఏమీ మాట్లాడడేమిటి? ఏమోయ్, నువ్వేమంటావ్?" భాస్కర్ అడిగాడు.

"నేను ఏపక్షమో నాకే తెలీదు" శేఖర్ తాపీగా అన్నాడు. "నా అభి ప్రాయాలు చాలా వున్నాయి. ఒక్క మాటలో చెప్పేవికావు!"

ఏ ప్రశ్నలూ వేయకుండా ఇంకా అతడు చెప్పేవాటికోసం అందరూ ఎదురు చూస్తూన్నారు.

ఏదో చెప్పబోయిన శేఖర్ ఆగి మోహన్ దెస చూచాడు. "ఇదుగో మోహన్, సీరియస్‌గా చెప్తున్నాను. నువ్వు వెధవగోల చేస్తే నేను భరించేది లేదు. నోరుమూసు క్కూర్చుంటావా



కూర్చో, లేదూ, పోయి వేరేగదిలో పడుకో. మోహానేకాదు; మోహన్ లాగ భయపడేవాళ్ళెవరైనా సరే వెళ్ళి పోండిక్కడినుంచి, మరేం సిగ్గు అవసరంలేదు."

చాలామందిమి వున్నాం అన్న ధైర్యంతో ఎవరూ కదలలేదు. అందరూ బింకంగానే వున్నారు.

"నేను చాలాకాలంగా ఆలోచిస్తున్నాను. మానవునిచుట్టూ వున్న ఈ మృత్యువు ఏమిటి? దయ్యం, భూతం, పునర్జన్మ – ఇవి ఏమిటి? ఎంతవరకూ నిజం? కొంతకాలం ఆధునిక ప్రపంచం దయ్యాలున్నాయనే వారిని పరిహాసించింది. కాని ఇప్పుడు ఈ ఆధునికుల నోళ్ళుకూడా మూతలుపడ్డాయి. ఎందుకంటే ప్రఖ్యాత పత్రికలలో విద్యాధికులూ, శాస్త్రవేత్తలూ అయినవారే రాస్తున్నారు. సకలదేశాలలో ఋజువులతోసహా లభిస్తూన్న పునర్జన్మ గాధలను, ఎందరో పరిశోధనలుకూడా జరుపుతున్నారని విన్నాం. ఈ సంఘటనలపై అమెరికా వైట్‌హౌస్‌లో లింకన్ మున్నగువారి ఆత్మలు ఇప్పటికీ ప్రతిరాత్రీ తిరుగుతాయనీ. కాపలావారందరికీ కన్పిస్తాయనీ, చాలకాలంగా

అలవాటై పోవడంవల్ల వారికి భయం కలగడం లేదనీ ఒక ప్రఖ్యాత ఆంగ్లేయ పత్రిక పెద్ద వ్యాసం వ్రాసింది. అలాగే కెనెడీ దయ్యంకూడా ఎప్పటి కైనా వస్తుందా చూద్దామని ఎదురు చూస్తున్నారట!

"మనదేశంలోకూడా ఇటువంటి కథల కేమీ కొదువలేదు. అయితే ప్రఖ్యాతవ్యక్తు లెవరూ ఈ ప్రస్తుత కాలంలో అలా కన్పించినట్టులేదు, గాంధీ నెహ్రూగారల ఆత్మలు ఏ మయ్యాయి?"

అందరూ శ్రద్ధగా వింటున్నారు. "బ్రతికుండగా దేశంమీద యింత శ్రద్ధ కనపరచారే, మరి తర్వాత ఈ దేశానికీ వాళ్ళకీ సంబంధంలేదా? బ్రతికున్నన్నాళ్ళూ తనవారిపై అంతంత ప్రేమలతో బ్రతికినవారు, చనిపోయాక ఈ బతికినవారు, చనిపోయాక ఈ బ్రతికున్న వారికోసం ఏం చేయలేదా?"

"ఆఁ నాన్సెన్స్," తేలికగా తృణీకరించి పారేశాడొకశ్రోత. "బొత్తిగా అసంభవమైన విషయాల్ని పట్టుకు సాగదీస్తావేమిటి, ఇవ్వాళ నీకే ఏదో క్రొత్తగా జ్ఞానోదయమైనట్టు?"

"ఛీ, అడ్డుతగలకు,చెప్పనీయ్. శేఖర్ చెబుతూన్నవన్నీ నిజంగా తర్కించి, శోధించవలసిన విషయాలు." భాస్కర్ శేఖర్‌ను బలపరుస్తూ మాట్లాడాడు.

"సరే, మీ అందరితో నాకు తర్కం దేనికి? నా ఆలోచనలు నా కున్నాయి. నా యిష్టం వచ్చినట్టు నేను అవన్నీ పరిశోధించుతాను. వినలేనివాళ్లూ, శ్రద్ధ లేనివాళ్లూ, ఆలోచనకూ, యదార్థానికీ తట్టుకొని నిలబడలేనివాళ్లూ వెళ్ళండి. ఎందుకిక్కడ నిద్రదండగ?" కోపంగా మాట్లాడాడు శేఖర్.

ఆ నిష్ఠురవాక్యాలు విని, నలుగురైదుగురు మినహాగా అందరూ అక్కడి నుంచి మెల్లమెల్లగా కదలిపోయారు. మోహన్ ముసుగుదన్ని గోడవైపుకు తిరిగి పడుకున్నాడు.

"దయ్యాలనేవి వున్నాయంటూరు శేఖర్," భాస్కర్ అన్నాడు. "మా పిన్నిని భర్త చాలా బాధపెట్టేవాడట, అందుకే ఆమె ఆత్మహత్య చేసుకుందట, అప్పుడప్పుడు కొందరికి కలలలో కన్పిస్తుందనీ మాట్లాడుతుందనీ అంటారు."

"కావచ్చు. మీ పిన్ని సంగతి వదిలేసేయ్, ఎవరికో కన్పించింది కాని నీకు కన్పించలేదుగా? కొన్ని దయ్యాలు కన్పిస్తాయనీ బాధపెడతాయనీ అంటారు, అదేమిటి?"

"ఔను, కొన్ని కొన్ని ప్రదేశాలలో చీకటి పడ్డాక మనుషులేకాదు; వాహనాలుకూడా నడపరు. బలవంతపు చావు చచ్చిన ఆత్మలు కొన్నికొన్ని ప్రదేశాలు పట్టుకుని అలా వుంటాయనీ, ఆ దారిన వెళ్ళేవారికి ఏదో ఒక

యాక్సిడెంట్ చేసి రక్తదాహం తీర్చుకుంటాయనీ అంటారు."

"ఆఁ" చిటికె వేశాడు శేఖర్. "సరిగ్గా నేనూ అదే విన్నాను. పని గట్టుకుని అటువంటి ప్రదేశాలమీదుగా ప్రయాణం సాగించాను. కాని నాకేమీ కాలేదు. ఏమీ కన్పించలేదు - నాకు ఒకే ఒక్క అనుమానం, మనిషికి మరణానంతరం దయ్యమై పీడించగల శక్తే వుంటే ఇక ఈ న్యాయస్థానాలూ, శిక్షలూ నిలిచేవా అని? తమను చంపిన వారిని, లేదా చావుకు కారణమైన వారిని అక్కడికక్కడే ఆ ఆత్మ చంపేసి ఎందుకు కక్ష తీర్చుకోదు? ఖూనీలు చేసినవాళ్ళెందరు తప్పించుకు తిరగటం లేదు?"

"నిజమే!"

"అంచేత ఆత్మలూ, దయ్యాలూ పేరిట దుష్టులు కొందరు చేసే పనులు కావచ్చు యివి. లేదా మరో మానవాతీత దుష్టశక్తులు కానచ్చు. మనిషి చచ్చాక ఆత్మకు-ఆత్మ నేది వుంటే - మాటలాడే శక్తి, పనిచేసే శక్తి కూడ వుండవని నా నమ్మకం. అదే పరిశోధిస్తాను, ఋజువు చేస్తాను."

"ఎలా ఋజువు చేస్తావ్?" ఒకరి ప్రశ్న.

"అవకాశం వచ్చినప్పుడు. అయినా నా కేమైనా జ్యోతిష్యం తెలుసా, నిశ్చయంగా చెప్పటానికి?" అంటూనే నవ్వేశాడు శేఖర్.

ఆదివారంనాడు తీరికగా కూర్చుని అదే విషయాన్ని ఆలోచిస్తున్న శేఖర్‌ను స్నేహితులు వచ్చి చుట్టుముట్టారు.

"ఆదివారమైనా కాస్త సుఖపడరా, ఆలోచనలు కట్టిపెట్టి. రా మేమందరం పిక్నిక్‌కు వెళ్తున్నాం."

"ఎక్కడికి?" శేఖర్ ప్రశ్న.

"ఆఁ, దూరం కాదులే. ఈ ఊరవతల తోటల్లోకి, సాయంత్రాని కొచ్చేయొచ్చు."

"సరే."

నాలుగు కార్లలో మొత్తం పాతిక మంది విద్యార్థులు బయలుదేరారు, ఆటలు, పాటలు, ఫలహారాలూ పిక్నిక్ సరదాగానే గడచింది సాయంత్రం వరకూ.

భాస్కర్ అన్నాడు, "అయిదు దాటింది, ఇక బయలుదేర్దామా? ఎనిమిదీ తొమ్మిదీ మధ్య మనం యిళ్ళు జేరుకోవచ్చు."

"వెళ్ళొచ్చులేరా తొందరేం? మనకూడా ఆడపిల్లలున్నారా ఏమన్నానా, కాస్త అటో ఇటోగా వెళ్ళొచ్చులే," అన్నాడు మోహన్.

అతడిని శేఖర్ గేలి చేశాడు. "ఆడపిల్లలకంటె భయస్థుడివి. నువ్వన్నావ్ కదరా నాన్నా! అందుకని! ఎలాగైనా ఆడపిల్లలు లేక పిక్నిక్ అందంగా లేదు."

అంతలో ఆ తోటమాలి అటుగా

వచ్చాడు. "ఆడపిల్లలైనా మొగపిల్లలైనా ఎవరైనా కాస్త పెంద లాడేనే ఈ ప్రాంతాలు దాటిపోవటం మంచిదికదా బాబూ?"

అందరూ ఆశ్చర్యంగా చూచారతడి వైపు.

"ఏం, ఎందుకు తాతా?" భాస్కర్ ప్రశ్నించాడు.

"మీరెక్కడికి వెళ్ళాలి?" తాత ప్రశ్న.

చెప్పారు భాస్కర్ ప్రభృతులు.

"మరైతే మీకు తెలియనే తెలియదా బాబూ?" తాత ఆశ్చర్యంతో కూడిన భయం రంగరిస్తూ మాట్లాడాడు. "రాత్రి ఎనిమిది దాటాక దయ్యాలబావి రోడ్డుమీదుగా ఎవరూ వెళ్ళరు బాబూ!"

"దయ్యాల బావా?" పది కంఠాలు ఒకేసారి అడిగాయి.

అంతవరకూ అలవోకగా పడుకుని కబుర్లు వింటూన్న శేఖర్, ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాడు. "ఏమిటి తాతా అది? ఎక్కడుందా దయ్యాల బావి?" అత్యుత్సాహంగా కుతూహలంతో ప్రశ్నించాడు.


మిగిలిన స్నేహితులంతా నవ్వారు. "మనవాడికి ఇక్కడకూడా మంచి మేత దొరికిందిరోయ్ మెదడుకు."

"మేం ఇటువేపులకు రావడం యిదే మొదటిసారి. అదేమిటో మేం విన లేదు. కాస్త వివరంగా చెప్పు తాతా." భాస్కర్ కూడా ప్రశ్నించాడు, శేఖర్‌తోపాటు.

"అదొక ఇల్లాలి కథ బాబూ! దుర దృష్టవంతురాలు!" జాలిగా విషయ వివరణ ప్రారంభించాడు తోటమాలి. "ఆమెగారు మహాసాధ్వి. పుట్టింటా అత్తింటాకూడా ఏలోటూ లేదు. బాగా కలిగున్న సంసారాలు. ఆమె ఎంతో అందగత్తె. అయితేనేం, చెడు సావాసాలు మరగిన ఆ భర్తకు ఈ భార్యపై యిష్టం వుండేదికాదు."

అందరూ శ్రద్ధగా వింటున్నారు. మోహన్ జాగ్రత్తగా అందరిమధ్యకూ సర్దుకు కూర్చుని వింటున్నాడు భయంతో ముడుచుకుపోతూ.

తాత తిరిగి మొదలుపెట్టాడు: "తప్ప త్రాగి, నానా గడపలూ త్రొక్కివచ్చి భార్యను కొట్టి, తిట్టి చిత్రహింసలు పెట్టేవాడు. కోడలి కష్టాలుచూచి, తానుకూడా ఆమెతోపాటు మౌనంగా దుఃఖించడం మినహా ఆ మామగారు ఏమీ చేయలేకపోయేవాడు కుమారుని. ఏమైనా అంటే ఆ ముసలి తండ్రిని కూడా చావగొట్టేవాడు ఆ ప్రబుద్ధుడు. ఆఖరుకు భార్య గర్భిణీగా వున్నప్పుడు, ప్రసవమై పచ్చి బాలెంతగా వున్నప్పుడూకూడ చావగొట్టేవాడు, నానా బాధలు పెట్టేవాడు. ఆఖరుకు ఆ బాధలన్నీ భరించలేక ముసలి




మామగారి కన్నీరు చూడలేక. తాను లేకపోతే కనీసం ఆ ముసలి ప్రాణమైనా సుఖంగా వుంటుందనే ఉద్దేశ్యంతో ఆ తల్లి ఒకనాడు తెగించి బిడ్డను ఊరవతల నూతిలో పారేసి తానుకూడా దూకేసింది. 'వద్దు తల్లీ, ఆత్మహత్య మహాపాపం' అంటూ వెంటబడిన ముసలి మామ ఏంచేయాలో తెలియని అయోమయస్థితిలో తానుకూడా ఆ నూతిలోనే పడ్డాడు. మూడు ప్రాణాలూ పోయాయి."

"పాపం!" శ్రోతలు జాలిగా అన్నారు.

"మరి ఆ ఛండాలుడేమయ్యాడు?" ఒకరి ప్రశ్న.

"ఎవరు, ఆమెభర్తా?" నిర్లక్ష్యంగా నవ్వాడు తాత. "అతడికేం? అలాటోళ్ళదే ఈ ప్రపంచం...మళ్ళీ ఎవళ్లో పెళ్ళి చేశారు. ఏదో అయ్యాడు. ఈ నూతిలో పడ్డ మూడు ప్రాణాలూ ఆ నూతినే ఆశ్రయించుకుని వున్నాయి. అదే దయ్యాలబావి. అర్ధరాత్రి వేళల్లో అందులోనుంచి పసిబిడ్డ ఏడుపు వినవస్తుంది. "ఊరుకో బాబూ ఏడవకు, అమ్మ పనిలో వున్నట్టుంది" అని తాత ప్రేమగా సముదాయించటం వినవస్తుంది. "ఇదిగో వచ్చేశా! ఏడవకు" అంటూ తల్లి ఊరడింపుగా అనటం, ఉయ్యాల వూపినట్లుగా గొలుసుల చప్పుడు, ఆ తర్వాత చక్కటి జోల పాట విన్పిస్తాయి."

"నిజం!"

"ఎవరైనా విన్నారా?"

"నువ్వు విన్నావా?"

లకు ప్రశ్నలు కురిసాయి శ్రోతల నుంచి ఒక్కసారిగా.

"ఆ, విన్నాను," తాత అన్నాడు. "ఈ ఊళ్ళో చూడనివాళ్ళూ విననివాళ్ళూ లేరు!"

"కన్పించుతారుకూడానా?"

"ఆఁ, తిరుగుతూనే వుంటుందట, కాని చల్లనితల్లి ఎవ్వర్నీ ఏమీ చెయ్యదు. అయితే, ఆమెకు యువకులంటే ఒక విధమైన ద్వేషం. తన భర్త యౌవన మదంతో తన నంతగా హింసించి చంపాడని..."

శేఖర్ చటుక్కున మాటమధ్యలో అందుకుని అన్నాడు, "ఏడిసినట్టేవుంది. ఒకడు తనను హింసించినందుకు అందరిపైనా ద్వేషమూ?"

"ఆఁ ఆఁ ఆఁ, బాబూ మాటలు మీరకండి," మహాపరాధం జరిగినట్లుగా లెంపలు వేసుకున్నాడు తోటమాలి. "ఆమె ఎవ్వర్నీ ఏమీ చెయ్యదుబాబూ. ఈ గ్రామదేవతగా అందరూ ఆమెను కొలుస్తారు. ఆమె చనిపోయిన రోజున ప్రతి సంవత్సరం ఆ బావిదగ్గర పూజలు, ఉత్సవాలు చేస్తారు. కాని ఆమెను ఎవరైనా చులకనచేసి మాట్లాడినా, దయ్యం దేవతాకాదు ఇదేమిటో అని ఆటాలు తీయబోయినా మరి బ్రతుకరు, ప్రాణాలు తీసేస్తుంది!"

శేఖర్ మినహాగా అందరూకూడా ఉలిక్కిపడి, శేఖర్ దెస చూచారు. మోహన్ మరీ ముడుచుకు కూర్చున్నాడు. శేఖర్ నిర్లక్ష్యంగానవ్వాడు. "అంతటి సమర్థురాలైతే ఆ భర్తమీదనే కక్ష తీర్చుకోకపోయిందా? మిగిలిన అందర్నీ బాధించటం దేనికి?"

"ఏమో, ఉన్న సంగతి నేను చెప్పాను బాబూ, అంతే," అన్నాడు తోటమాలి ముక్తసరిగా.

"ఒరే, ఆ దయ్యాలబావి సంగతేమిటో నేను చూస్తాను రా," అన్నాడు శేఖర్ యిళ్ళకు వెళ్తూన్న దారిలో.

ఒక్క క్షణంగా తటపటాయించి అన్నాడు భాస్కర్: "నా కేమీ భయం లేదు కాని, ఎందుకు అనవసర విషయాలు మనకని!"

"అవసరం అనవసరం వదిలేసేయ్. ఈ సంగతి నా మనస్సులో బాగా పట్టేసింది. ఈ పరిశోధన తేలితేకాని నాకు తోచదు."

"పోనీ మరోరోజున వద్దాం లే. ఇవాళ ప్రొద్దుపోయింది. ఇళ్లు చేరుకోవాలి. ప్రొద్దున్నే లేచి కాలేజీకి అటెండవ్వాలి."

"అవును, అందుకే మీరంతా వెళ్లండి. ప్రొద్దుపోయినా సరే, రేపొక్కరోజు కాలేజీకి వెళ్ళకపోయినా సరే నాకు ఫర్వాలేదు," స్థిరంగా అన్నాడు శేఖర్. కారులో యింకా వున్న అతడి స్నేహితులు ముఖముఖాలు చూచుకున్నారు.

కారు ఆపాడు నడుపుతూన్న శేఖర్. ఒక కారు ఆగిందని అన్ని కార్లూ ఆగాయి.

"ఏమిటి? ఏమైనా ట్రబులా?" ఎదర కారుల్లోంచి, వెనుక కారులో నుంచీ ప్రశ్నల పరంపర.

"కాదు," అంటూ శేఖర్ దిగాడు. అతడి వెనుక భాస్కర్ దిగాడు. వెనుకా, ముందూ వున్న కార్లలో వ్యక్తులు కూడా కొందరు దిగివచ్చారు 'ఏమి' టంటూ. విషయం వింటూనే ఎవరి మటుకువారే నోళ్ళావళించారు. శేఖర్‌ను మంచిగా వారించారు, వద్దని. శేఖర్ మాత్రం తనపంతం విడువలేదు.

"అయితే నీ యిష్టం, మేం మాత్రం పోతున్నాం." ఖచ్చితంగా చెప్పేస్తూ తిరిగి కార్లు ఎక్కేశారు చాలామంది.

"వెళ్ళండి. నాకేం భయంలేదు. నాకెవరిసాయం అక్కర్లేదు." శేఖర్ కూడా నిక్కచ్చిగానే చెప్పాడు.

భాస్కర్ మాత్రం అలా తప్పుకోలేకపోయాడు. "ఒరేయ్ చూస్తూ చూస్తూ ఇటువంటి విషయంలో నిన్నొక్కడినీ ఎలావదలగలనురా? నేనూ వుంటాను." అతడి మాటలు విని మరి



కొంతమంది ఆగిపోయారు చాలా మందిమి వున్నామన్న ధైర్యంతో.

మిగిలినకార్లు ఇంకా స్టార్టు అవ్వక ముందే వెనుకనుంచి "అయ్యో శేఖర్, ఏమిట్రాయిది? శేఖర్ శేఖర్" అంటూ ఆర్తనాధాలు వినరావడంతో మళ్ళీ అందరూ కార్లు దిగి శేఖర్ దగ్గరకు పరుగెత్తారు. ఏదో చెప్పరాని బాధతో మెలితిరిగిపోతూ, రక్తం కక్కుకుంటూ నోటమాట రాకుండా వున్న శేఖర్‌ను భాస్కర్ ప్రభృతులు పడకుండా పట్టుకుని కారులో పడుకోబెడుతున్నారు అయోమయంగా అరుస్తూ.

"పట్టుకోరా జాగ్రత్తగా మోహన్. తొందరగా హాస్పిటల్ జేరుకోవాలి. ఆలస్యం వద్దు" అంటూనే భాస్కర్ కారు పరుగెత్తించాడు. మిగిలిన కార్లు అనుసరించాయి.

"దయ్యాల బావి పరిసరాలే నను కుంటా నివి?" ఒక రెవరో గుసగుసగా అన్నారు.

"మీకు పుణ్యముంటుంది ఆ సంగతి ఎత్తకండిరా, వీడిగతి చూడండి," మోహన్ గాభరాగా అన్నాడు.

మరెవరూ మాట్లాడలేదు.

డాక్టర్ పరీక్షించి పరీక్షించి అన్నాడు: "ఏ విధమైన రుగ్మతా లేదు శరీరంలో. ఆశ్చర్యంగా వుందే. అయినా ప్రయత్నిస్తాను. ప్రస్తుతానికి మార్ఫియా ఇస్తున్నాను."

కాస్సేపటికి కాళ్ళూ చేతులూ కొట్టుకోవటం మాని మగతగా నిద్రపోసాగాడు శేఖర్. స్నేహితు లంతా తలోమూలా గోడకు జేరబడి తమకు తెలియకుండానే నిద్రలోనికి జారారు.

అర్ధరాత్రివేళ ఎందుకో మెలకువ వచ్చిన మోహన్ కిటికీదగ్గర నుంచుని వున్న శేఖర్‌ను చూచి సంభ్రమాశ్చర్యాలతో అడిగాడు: "ఓరినీ! అప్పుడే లేచి తిరుగుతున్నావట్రా? ఏం కావాలి, మంచినీళ్లా? మమ్మల్ని లేపి అడగ కూడదూ?"

ఆ సందడికి భాస్కర్, తదితరులు మేల్కొన్నారు.


"ఎలావుందిరా ఒంట్లో? ఇంగారు పెట్టి చంపేశావ్ కదరా! ఏమైందిట్రా నీకు వున్నట్లుండి?" అందరూ అడిగారు, ఒకేసారి.

శేఖర్ మాట్లాడలేదు, చిత్రమైన చిరునవ్వు నవ్వాడు. నిర్లక్ష్యంగా, నిరసనగా చూచాడు.

"అదేమిట్రా అలానవ్వుతావ్? నీ కళ్ళు అలా వున్నాయేమిటసలు?" అంటూ భాస్కర్ శేఖర్ దెసగా అడుగులువేయసాగాడు.

"మాట్లాడరా నాయనా, పోదామా హాస్పిటల్‌నుంచి యిక?" మోహన్ అడిగాడు.

అలా అందరూ అడుగుతూండగానే, చూస్తూండగానే శేఖర్ మెల్లమెల్లగా




కదలి దూరదూరంగా జరిగిపోతూ మరి కన్పించకుండా పోయాడు.

"ఇదేమిటి?" అనే ప్రశ్నే అందరి కండ్లలోనూ. మాటలుడిగి, చేష్టలు దక్కి ఒకరి ముఖా లొకరు చూచుకుంటూండగా "ఎలా వున్నాడు మీ ఫ్రెండ్?" అంటూ డాక్టర్ ప్రవేశించాడు. "ఇంకా నిద్రేనా? మధ్యలో ఏమైనా అడిగాడా లేచి?" అంటూ మంచం వేపు నడిచాడు. అందరి దృష్టి అప్పుడటు తిరిగింది. శేఖర్ మామూలుగానే నిర్మలంగా నిద్రపోతున్నాడు. డాక్టర్, నర్స్ మినహాగా మిగిలిన వారంతా బిగుసుకుపోయారు. భాషాతీతమైన ఆశ్చర్యానుభూతితో కొలది క్షణాలు కనురెప్పలుకూడ కదలకుండా చూస్తూండిపోయారు.

శేఖర్ నాడి చూస్తూనే తృళ్ళిపడ్డాడు డాక్టర్. "ఐయామ్ సారి వెరీ సారీ" అంటూ తల వంచుకున్నాడు, శేఖర్ తలవరకూ నర్సు తెల్లని బట్ట కప్పేసింది.

అందరిలో దుఃఖం పెల్లుబికింది. "ఈ పరిశోధనలో నీ ప్రాణాలనే తీసుకున్నావ్ కదరా శేఖర్! ఆత్మలున్నాయని నిరూపించి తీరుతానన్నావ్. అన్నంతపనీ చేశావ్!" కిటికీ దెస చూస్తూ గుండె లవిసేలా రోదించ సాగాడు భాస్కర్.